సాక్షి
నంద్యాల

శనివారం : 16 : నవంబర్ : 2024



క్వింటా ఉల్లి రూ.4,604

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధర నిలకడగా కొనసాగుతోంది. శుక్రవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 7,007 క్వింటాళ్ల ఉల్లి రాగా, గరిష్ట ధర రూ.4,604 పలికింది.



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద పథకానికి కర్నూలుకు చెందిన భక్తుడు శ్రీరామయ్య రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలుకు అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 98.158
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,253
అవుట్ ఫ్లో	: 8,916

న్యూస్‌రీల్

శ్రీశైల దేవస్థాన ఈఓగా చంద్రశేఖర ఆజాద్



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా ఎస్.ఎస్. చంద్రశేఖర ఆజాద్ నియమితులయ్యారు. తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయనకు ఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఈఓగా విధులు నిర్వహిస్తున్న ఇ.చంద్రశేఖరరెడ్డిని రిలీవ్ చేశారు. కాగా ఆజాద్‌కు గతంలో శ్రీశైల దేవస్థాన ఈఓగా పనిచేసిన అనుభవం ఉంది.

వైఎస్సార్‌సీపీలో ముగ్గురికి పార్టీ రాష్ట్ర స్థాయి పదవులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ముగ్గురికి పార్టీలో రాష్ట్ర స్థాయి పదవుల్లో నియమించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా తెర్నేకల్ సురేందర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మద్దూరి సుభాష్ చంద్రబోస్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వీరారెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. నియమితులైన ఈ ముగ్గురు పార్టీ అనుబంధ విభాగ కమిటీల నియామకం, అనుబంధ విభాగ కార్యక్రమాల సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తారు.

శ్రీశైలం నుంచి 15,402 క్యూసెక్కుల నీరు విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి శుక్రవారం దిగువకు 15,402 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 6,000 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,611 క్యూసెక్కులు, నాగార్జున సాగర్‌కు 5,387 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎడమగట్టు కేంద్రంలో 2.494 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 0.80 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 165.9244 టీఎంసీల నీరు నిల్వ ఉండగా నీటిమట్టం 875.50 అడుగలకు చేరుకుంది.

27 నుంచి శిక్షణ తరగతులు

నంద్యాల(న్యూటౌన్): జర్మనీ భాషలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 27 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు సెల్ : 6300324076 నంబరును సంప్రదించాలన్నారు.

ఎరువుల అమ్మకాలకు బిల్లులు తప్పనిసరి



గిరిజనులకు మినుముల కిట్లు పంపిణీ చేస్తున్న డీఏఓ మురళీకృష్ణ

నంద్యాల(రూరల్): ఎరువులు, పురుగు మందుల అమ్మకాలకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా ఉండాలని ఫర్టిలైజర్ దుకాణదారులకు నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఫర్టిలైజర్ దుకాణదారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. దుకాణాల లైసెన్స్, స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్, కంపెనీ, టెక్నికల్, బ్యాచ్ నంబర్‌తో వ్యాపారాలు నిర్వహించాలన్నారు. బిల్లులో అన్ని వివరాలు పొందుపరచి, రైతు సంతకంతో బిల్లు వేయాలని సూచించారు. అనుమతి కలిగిన పురుగు మందులనే రైతులకు విక్రయించాలని, అది కూడా ఎంఆర్‌పీకి మించి అమ్మరాదని హెచ్చరించారు. సమావేశంలో నంద్యాల, నందికొట్కూరు వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్, విజయశేఖర్, ఏఓలు పాల్గొన్నారు.

వ్యవసాయంపై మొగ్గు చూపండి

మహానంది: గిరిజనులు వ్యవసాయంపై మొగ్గు చూపాలని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మహానంది సమీపంలోని చెంచులక్ష్మీ గూడెంలోని గిరిజనులకు శుక్రవారం వీబీఎన్-8 రకం మినుముల కిట్లను పంపిణీ చేశారు. ఆర్‌ఓఎఫ్ఆర్ భూములను సాగు చేస్తున్న రైతులకు వంద కిలోల విత్తనాల కిట్లను 25 మందికి అందించారు. అనంతరం ఆయన మహానందికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు.



శ్రీశైలంలో ఆధ్యాత్మికభరితంగా జ్వాలాతోరణోత్సవం

దీపం..దేదీప్యమానం

నేత్ర పర్వం.. జ్వాలాతోరణం



భ్రమరాంబామల్లికార్జున స్వామి అమ్మవార్లకు దశవిధ హారతులు ఇస్తున్న అర్చకులు

ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. భక్తుల శివనామస్మరణ మార్మోగింది. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థానం గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించింది. సంప్రదాయబద్ధంగా పుణ్యనదీహారతి, ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి దశవిధ హారతులు దేదీప్యమానంగా సాగాయి. భ్రమరాంబామల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఈ విశేషపూజా కార్యక్రమాలను తిలకించి పరవశించిపోయారు.

– శ్రీశైలంటెంపుల్



తుంగభద్రమ్మకు నక్షత్ర హారతులిస్తున్న వేదపండితులు

శ్రీ మఠం..కార్తీక శోభితం

పండితుల వేద మంత్రోచ్చారణలు... భక్తజన కోలాహలం...దీపాకాంతుల మధ్య మంత్రాలయంలో తుంగా తీరం శోభాయమానంగా కనిపించింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో లక్ష దీపోత్సవం, తుంగభద్ర నది పుణ్యహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఊంజల మంటపంలో జ్యోతి ప్రజల్వన చేసి ఉత్సవాలకు పీఠాధిపతి అంకురార్పణ పలకగా బాజాభజంత్రీలు, మేళాతాళాలు, భజన, కోలాటాల బృందాలతో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు ఊరేగింపుగా తుంగభద్రనదితీరానికి చేరుకున్నారు. అక్కడ సభా వేదిక పై ఆశీనులైన ప్రహ్లాదరాయులకు హారతి



ఉత్సవమూర్తికి హారతులిస్తున్న శ్రీమఠం పీఠాధిపతి

చేపట్టి లక్షదీపోత్సవానికి శ్రీకారం చుట్టారు. అర్చకులు తుంగభద్రమ్మకు శాస్త్రోక్తంగా కార్తీక నక్షత్ర హారతులు పట్టగా.. భక్తులు పుష్కరఘాట్లపై కార్తీక దీపాలను వెలిగించి వేడుకల్లో తరించారు.

– మంత్రాలయం



కృష్ణమ్మకు దీపారాధన చేస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమి శోభతో శైవ క్షేత్రాలు కాంతులీనాయి. ఆధ్యాత్మికోత్సాహం వెల్లివిరిసింది. హరహర మహాదేవ..శంభోశంకర అంటూ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రణమిల్లింది. భక్తి పారవశ్యంతో పులకించింది. ఇల కైలాసమైన శ్రీశైలం, మహానందిలో శుక్రవారం జ్వాలాతోరణోత్సవం కనుల పండువగా జరగగా.. శ్రీ రాఘవేంద్రుడి సన్నిధి అయిన మంత్రాలయంలో తుంగా హారతి, కర్నూలు నగరంలో లక్ష దీపోత్సవం కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చారణలు... భక్తజన కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా సాగాయి.



శ్రీశైలంలో ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం



మహానందిలో జ్వాలాతోరణం దృశ్యం

'మహా' వైభవం..

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మహానందిలో జ్వాలాతోరణం, కోటి దీపోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆమె కార్తీకదీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో స్వామి,అమ్మవార్లకు పూజలు చేశారు.

– మహానంది

'వరి'ంచని అదృష్టం!



ఇతని పేరు గుర్రప్ప. శిరువెళ్ల మండలం కోటపాడు గ్రామం. గత ఏడాది వరికి మార్కెట్‌లో మంచి ధర లభించింది. దిగుబడులు ఆశాజనకంగా రావడంతో పెట్టుబడులు పోనూ ఆదాయం చేకూరింది. దీంతో ఈ ఏడాది సొంతపొలంతోపాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని 45 ఎకరాల్లో వరి సాగుచేశాడు. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 40 వేలు వెచ్చించాడు. ప్రస్తుతం పైరు కోత దశకు చేరుకుంది. గత ఏడాది క్వింటా రూ. 2వేలకు పైగా అమ్మాడు. ప్రస్తుత మార్కెట్‌లో బస్తా రూ.15 వందలలోపే ఉందని ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా రావు అని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.



కోవెలకుంట్లకు చెందిన ఇతని పేరు వెంకటేశ్వర్లు. తనకున్న ఐదు ఎకరాల సొంత పొలంతోపాటు ఎకరాకు 13 బస్తాలు వడ్లు చెల్లించేలా మరో 20 ఎకరాలను కౌలుకు తీసుకుని కర్నూలు సోనా రకానికి చెందిన వరి సాగు చేశాడు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు, కోత, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 40 వేల వరకు ఖర్చు చేశాడు. పైరు చేతికందటంతో ఇటీవలే కోత, నూర్పిడి పనులు చేపట్టాడు. ఎకరాకు 30 బస్తాలకు మించి దిగుబడులు రాకపోవడంతో దిక్కుతోచడం లేదని వాపోతున్నాడు.

జిల్లాలో చాలా మంది రైతుల పరిస్థితి ఇదే. గతేడాది ఖరీఫ్ వరి సాగు అన్ని విధాలా కలిసి రావడంతో ఈసారి సాధారణ విస్తీర్ణానికి మించి సాగు చేశారు. వాతావరణం అనుకూలించక దిగుబడులు తగ్గడంతో పాటు మార్కెట్‌లో ఆశించిన ధర కూడా లేకపోవడంతో రైతులు నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోంది.

- రైతులకు కలిసిరాని ఖరీఫ్ సాగు
- వరికి ఎకరాకు రూ. 40వేల పెట్టుబడి
- మార్కెట్‌లో బస్తా రూ. 1500 లోపే
- రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మరింత నష్టం
- ఆందోళనలో రైతన్నలు



కోవెలకుంట్ల పట్టణ శివారులో వడ్లను విక్రయిస్తున్న దృశ్యం

జిల్లాలో వరిసాధారణ విస్తీర్ణం : 1.64 లక్షల ఎకరాలు
సాగైంది: 1.65 లక్షల ఎకరాలు
దిగుబడులు ఎకరాకు: 30 బస్తాల వరకు

కోవెలకుంట్ల: జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది 1.64 లక్షల ఎకరాల్లో వరి సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఆయా మండలాల పరిధిలో బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కుందూనది, పాలేరు, కుందరవాగు, కేసీకెనాల్, తదితర సాగునీటి వనరుల ఆధారంగా 1.65 లక్షల ఎకరాల్లో కర్నూలు సోనా, నంద్యాల సోనా, 555 రకానికి చెందిన వరి సాగు చేశారు. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని అవుకు మండలంలో 11,953 ఎకరాల్లో, కోవెలకుట్ల మండలంలో 3,748 ఎకరాల్లో, సంజామల మండలంలో 3,470 ఎకరాల్లో, ఉయ్యాలవాడ మండలంలో 2,620 ఎకరాల్లో, దొర్నిపాడు మండలంలో 2,507 ఎకరాల్లో, కొలిమిగుండ్ల మండలంలో 820 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం పైరు చేతికందటంతో కోత, నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు.

గతేడాది మంచి దిగుబడులు.. ఆశించిన ధర

గతేడాది సకాలంలో వర్షాలు, సాగునీటి వనరులు అందుబాటులో ఉండి వాతావరణం అనుకూలించింది. దీంతో ఎకరాకు 40 నుంచి 42 బస్తాల దిగుబడులు లభించాయి. వరినారు, నాట్లు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు, కోత, నూర్పిడి, తదితర వాటికి పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు వెచ్చించారు. గ్రేడ్-1 రకం క్వింటా 2,203, గ్రేడ్-2 రకం రూ. 2,183 ధరను ప్రభుత్వం నిర్ణయించింది. దిగుబడులు ఆశాజనకంగా రావడం, ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర ఉండటంతో పెట్టుబడులు పోనూ రైతులకు ఆదాయం చేకూరింది.



వర్షానికి నేలవాలిన వరిపైరు

ఈసారి కలిసిరాని సాగు

గతేడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చి మార్కెట్‌లో మంచి ధర పలకడంతో ఈ ఏడాది చాలా మంది రైతులు వరి సాగు చేశారు. జిల్లాలో సాధారణ విస్తీర్ణం మించి సాగు చేశారు. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 35వేల నుంచి రూ. 40 వేలు ఖర్చు చేశారు. కౌలు రైతులు ఎకరాకు ఖరీఫ్‌లో 10 బస్తాలు, రబీలో మూడు బస్తాల వడ్లు చెల్లించేలా వరిమడులను కౌలుకు తీసుకున్నారు. పైరు వివిధ దశల్లో అధిక వర్షాలు కురవడంతో తెగుళ్ల సోకాయి. దీనికితోడు అక్టోబర్ నెలలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా ఎకరాకు 30 బస్తాలకు మించి దిగుబడులు రాని పరిస్థితి. ధాన్యం అమ్ముకుందామంటే మార్కెట్‌లో గిట్టుబాటు ధర అంతంత మాత్రంగానే ఉండటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. గతేడాది క్వింటా రూ. 2,200 ధర పలకగా ప్రస్తుతం బస్తా రూ. 1,490 మాత్రమే ఉంది. ఈ ధరకు విక్రయిస్తే కనీసం పెట్టుబడులు కూడా రావని రైతులంటున్నారు.

కురుస్తున్న వర్షాలతో మరింత నష్టం

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఖరీఫ్ వరి చేతికందటంతో రైతులు కోత, నూర్పిడి పనులు చేస్తున్నారు. వాతావరణం అనుకూలించక దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తుండగా బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కోత దశలో ఉన్న వరి నేలవాలి వడ్లు రాలిపోవడం, ఆరోబోసిన వడ్లు తడిచిపోవడం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని విధాలా ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ఈ ఏడాది నాకున్న ఐదు ఎకరాల సొంత పొలంలో వరి సాగు చేశాను. వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. పెట్టుబడుల రూపంలో వేలాది రూపాయాలు పెట్టాను. మార్కెట్‌లో బస్తా రూ. 15వందల లోపే ఉంది. ఈ ధరకు విక్రయిస్తే కనీసం పెట్టుబడులు కూడా లభించవు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– రాజారెడ్డి, రైతు, కంపమల్ల, కోవెలకుంట్ల మండలం

20 నుంచి ఇసుక నిల్వ డిపోలు ప్రారంభం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: ఈనెల 20వ తేదీ నుంచి ఇసుక నిల్వ డిపోలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ రాజ కుమారి వెల్లడించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా ఇసుక సరఫరాపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున నంద్యాల, బనగానపల్లెలో టన్ను ఇసుక రూ.884, నందికొట్కూరులో టన్ను ఇసుక రూ.744, ఆళ్లగడ్డలో టన్ను ఇసుక రూ.719 చొప్పున ప్రభుత్వం నిర్ధారించిన ధరకే వినియోగదారులకు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదించారు. ఆత్మకూరు, డోన్ నియోజకవర్గాల్లో కూడా ఇసుక నిల్వ డిపోల నిర్వహణకు టెండర్లు ఆహ్వానించామని ఈనెల 19 తర్వాత అర్హులైన వారిని గుర్తించి డీలర్ లైసెన్సులు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, భూగర్భ గనుల శాఖ ఏడీ వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ పాల్గొన్నారు.

స్కిల్ డెవలెప్‌మెంట్ కోర్సుల్లో చేరండి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రధానమంత్రి కౌశల్‌వికాస్ యోజన పథకం ద్వారా నేషనల్ స్కిల్‌డెవలెప్‌మెంట్ కార్పొరేషన్, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కోర్సుల్లో చేరాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.రంగయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సివిల్, ప్లంబింగ్ జనరల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, బ్యాటరీ సిస్టం అసెంబ్లీ ఆపరేటర్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, జూనియర్ ఇంజినీరింగ్ పవర్, మెకానికల్ ఇంజినీరింగ్, ఐరన్ అండ్ స్టీల్ వెల్డర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ప్రకటన వెలువడిన వారం రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 9573110416, 9912342068 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అపార్ నమోదు త్వరగా పూర్తి చేయండి

- పాణ్యం ప్రభుత్వ పాఠశాల తనిఖీలో ఆర్‌జేడీ శామ్యూల్

పాణ్యం: ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు వేగవంతం చేయాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ శామ్యూల్ అన్నారు. శుక్రవారం పాణ్యం ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో అపార్ ఐడీ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం జరగరాదన్నారు. మండలంలో అపార్ నమోదు తక్కువగా ఉన్న కేశవరెడ్డి స్కూల్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంఈఓ కోటయ్యను ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలా వచ్చినప్పుడే వారు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన తయారీని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ బోధన గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటయ్య, హెచ్ఎం మేరీ సునీతా పాల్గొన్నారు.



అపార్ నమోదు వివరాలు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

నేటి నుంచి డీఎస్సీకి ఉచిత శిక్షణ

కర్నూలు (అర్బన్): బీసీ స్టడీ సర్కిల్‌లో శనివారం నుంచి మెగా డీఎస్సీ (సెకండరీ గ్రేడ్ టీచర్స్/స్కూల్ అసిస్టెంట్) ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు ఎంపికైన 220 మంది అభ్యర్థులకు ఈనెల 16వ తేదీ నుంచి 60 రోజుల పాటు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. శిక్షణ కాలం పూర్తయిన తర్వాత అర్హులైన అభ్యర్థులకు స్టైఫండ్ మంజూరు చేస్తామని ఆమె తెలిపారు.

క్లుప్తంగా

25 నుంచి 108 ఉద్యోగుల సమ్మె



జేసీ నవ్యకు సమ్మె నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): తమ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 28 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కిరణ్‌కుమార్, కేవీవీ నరసింహారావు తెలిపారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్‌ను ఆమె కార్యాలయంలో కలసి సమ్మె నోటీసును అందజేశారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే తాము సమ్మెకు వెళ్తున్నామని వారు జేసీకి వివరించారు.

పత్తిలో తేమ శాతం 12కు మించరాదు

కర్నూలు(అగ్రికల్చర్): విక్రయానికి తెచ్చేపత్తి దిగుబడుల్లో తేమ శాతం 12కు మించకుండా ఆరబెట్టుకుని రావాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి రైతులకు సూచించారు. శుక్రవారం ఆమె జిన్నింగ్ మిల్లులను పరిశీలించి దిగుబడులను తెచ్చిన రైతులతో మాట్లాడారు. పత్తికి పూర్తి మద్దతు ధర లభించాలంటే ఇంటి వద్ద ఆరబెట్టుకొని తగిన నాణ్యతా ప్రమాణాలతో తీసుకెళ్లాలని సూచించారు. తేమ 8 శాతం వరకు ఉంటేనే పూర్తి మద్దతు ధర అంటే రూ.7521 లభిస్తుందని, 9 నుంచి 12 శాతం వరకు తేమ ఉంటే ఒక్కో శాతానికి మద్దతు ధరలో ఒక్క శాతం ధర కోత విధించనున్నట్లు తెలిపారు. గరిష్టంగా 12 శాతం మాత్రమే తేమ ఉండాలని, అంతకు మించి తేమ ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేయదన్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడుల్లోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేస్తారని, ఈ అవకాశాన్ని పత్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అప్పు వ్యవహారంలో ఉద్రిక్తత



వాహనాన్ని అడ్డుకున్న స్థానికులు

కోవెలకుంట్ల: అప్పు వ్యవహారం కోవెలకుంట్లలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. నంద్యాల మాజీ ఎంపీ దివంగత ఎస్పీవై రెడ్డి కుమార్తె సుజల పైపుల ఫ్యాక్టరీకి సంబంధించి వ్యాపార పనుల నిమిత్తం కోవెలకుంట్లకు వచ్చింది. ఆమె పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యేశ్వర పాలిమర్స్ అధినేత సూర్యనారాయణరెడ్డికి రూ.10 కోట్ల వరకు అప్పు చెల్లించాల్సి ఉంది. ఓ పైపుల దుకాణం వద్ద ఉందని విషయం తెలుసుకున్న అతని కుమారుడు సుధీర్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. తీసుకున్న అప్పు చెల్లించాలని అడిగే సమయంలోనే ఇన్నోవా వాహనంలో ఎక్కి బయలుదేరేందుకు ప్రయత్నించారు. సుధీర్‌రెడ్డి వాహనం ఆపి మాట్లాడాలని బైక్‌తో ఇన్నోవాను అనుసరించాడు. ఈక్రమంలో గ్రామపంచాయతీ కార్యాలయ సమీపంలో వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో కింద పడ్డాడు. అయినప్పటికీ వాహనం వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని వా హనం ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు.సుధీర్‌రెడ్డి, ఎస్పీవై రెడ్డి కుమార్తెకు వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.



అహోబిలంలో ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న దృశ్యం



మహానందిలో కార్తీక దీపం వెలిగిస్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి



ఆదోని రణమండల కొండపై..



నంద్యాల ప్రథమనందిలో..

ఆరనీకుమా ఈ దీపం.. కార్తీక దీపం..!



శివనామ స్మరణతో శైవ క్షేత్రాలు మారుమ్రోగాయి. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మికత సంతరించుకుంది. మహిళలు తెల్లవారుజామునే తలంటుస్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించుకున్నారు. జమ్మి, ఉసిరి, వేప చెట్ల వద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీశైలంలోని పాతాళగంగ కృష్ణమ్మకు పుణ్యనదీ హారతులు



యాగంటిలో ఆకాశదీపం వెలిగిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కర్నూలులో కార్తీక పౌర్ణమి వేడుకలను ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య, కలెక్టర్ రంజిత్ బాషా, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులు తదితరులు



ఆస్పరిలో లక్ష దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో మహిళలకు పూలు, గాజులు అందిస్తున్న దృశ్యం



యాగంటిలో లక్ష దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



శ్రీశైలంలోని పుష్కరిణి వద్ద కళాకారుల సంప్రదాయ నృత్యప్రదర్శన

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల్లో ప్రమాదాలు జరిగే 28 బ్లాక్‌స్పాట్లను గుర్తించారని, ఆయా ప్రాంతాల్లో ఏ విధమైన చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించేందుకు వీలవుతుందో జాతీయ రహదారులు, పోలీసుల, కర్నూలు మునిసిపల్ కమిషనర్ సంయుక్తంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. కర్నూలు నగరంలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు వీలుగా ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల, బస్టాండ్‌లోపల ఆటోస్టాండ్‌లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నగరంలో ప్రధాన కూడళ్లలో ఉన్న పెద్ద సర్కిళ్లను తగ్గించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కర్నూలు బస్టాండ్ నుంచి డోన్, అనంతపురం, బెంగళూరు వెళ్లే బస్సులను రాజ్‌విహార్ బస్టాండ్ నుంచి ఆపరేట్ చేసే అంశంపై ట్రయల్ రన్ చేయాలని ఆర్‌ఎంకు సూచించారు. కర్నూలు నుంచి ఓర్వకల్ ఎయిర్‌పోర్టుకు రెండు బస్సులను నడపాలన్నారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ నగరంలో పనిచేయని సీసీ కెమెరాల స్థానంలో హైరెజుల్యూషన్ ఉన్న 8 మెగా పిక్సెల్ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారుల్లో ఒకటే ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతుంటే అక్కడ రంబుల్ స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు సిటీ బస్సులు లేనందున ద్విచక్రవాహనాల్లో వెళ్తుండడంతో ట్రాఫిక్ అధికమవుతోందని, సిటీ బస్సులను నడిపితే బాగుంటుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించాలని ఆర్‌ఎంను ఆదేశించారు. త్వరలో 100 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయని ఆర్‌ఎం వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, డీటీసీ శాంతకుమారి, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వీఓఏ మృతి కారకులు తప్పించుకోలేరు

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: మండలంలోని కొత్తబురుజు గ్రామ వెలుగు వీఓఏ(బుక్ కీపర్) వెంకట్రామిరెడ్డి మృతికి పరోక్షంగా కారకులైన అధికారులు ఏ స్థాయిలో ఉన్నా భవిష్యత్తులో శిక్ష తప్పదని రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మృతిని భార్య లక్ష్మీదేవితోపాటు కూతుళ్లను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరునిగా ఉన్న వెంకట్రామిరెడ్డి మితభాషి, వివాదరహితుడని, 30 ఏళ్లుగా వెలుగు ప్రాజెక్టులో పనిచేస్తున్నారంటే ఆయన మంచితనం ఏ పాటిదో అర్థమవుతుందన్నారు. ఇలాంటి వ్యక్తిని బుక్‌కీపర్ పదవి కోసం వేధించి, మానసికంగా హింసించి గుండెపోటుతో మృతిచెందడానికి కారకులయ్యారని అధికార కూటమి నాయకులపై బుగ్గన మండిపడ్డారు. బుక్‌కీపర్ మృతికి కారకుడైన ఏపీఎం మల్లికార్జున పెద్ద అవినీతి పరుడని, గతంలో అతనిపై ఆరోపణలు రావడంతోనే ఇతర ప్రాంతాలకు బదిలీ చేశామని బుగ్గన ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో తిరిగి వెలుగు ప్రాజెక్టు అధికారిగా పదవి చేపట్టిన వెంటనే వెంకట్రామిరెడ్డిని బలితీసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంకట్రామిరెడ్డి మృతికి ఏపీఎం మల్లికార్జున, సీసీ ఈశ్వరమ్మలే బాధ్యత వహించాలన్నారు. ఈ విషయంలో వీరికి శిక్ష పడేవరకు పోరాటం చేస్తామని మృతుని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు రాజకీయ పార్టీ నాయకులకు బానిసలుగా పనిచేయరాదని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ మదన్‌యాదవ్, కోఆప్షన్ సభ్యులు ఉసేన్, పార్టీ నాయకులు చిన్నపూజెర్ల రామచంద్రారెడ్డి, ఎర్రగుంట్లపల్లె వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, మధురెడ్డి, రంగనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆర్‌ఈ రాజవర్దన్, రమణారెడ్డి, చిరంజీవి, యాపదిన్నె నరసింహారెడ్డి, ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, నక్కవాగులపల్లె రమణారెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు కేసులు బనాయిస్తే దండన తప్పదు

- అధికారులను హెచ్చరించిన మాజీ మంత్రి బుగ్గన

డోన్: కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కేసులు పెడితే రానున్న రోజుల్లో దండన ఎదుర్కోక తప్పదని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. డోన్‌లోని తన స్వగృహంలో బుగ్గన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే గొంతుకలను పోలీసుల సహకారంతో కూటమి నేతలు అమానుషంగా నొక్కివేస్తున్నారని మాజీ మంత్రి బుగ్గన మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను, సోషల్ మీడియా కార్యకర్తలను వేధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలోని ఓ వర్గం పనిచేస్తోందన్నారు. కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి తప్పుడు ఫిర్యాదులిచ్చే నాయకులకు, కేసులు కట్టే అధికారులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని హెచ్చరించారు. పాలకులకు తొత్తులుగా వ్యవహరించే అధికారులను వదలబోమన్నారు. ప్రజా మద్దతుతో తప్పక తాము అధికారంలోకి వస్తామని, అప్పుడు ఆ అధికారులు సప్తసముద్రాల అవల ఉన్నా కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దమనకాండ సాగిస్తున్న కూటమి నాయకులు కూడా భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు అధికారుల హడావుడి

- తూతూమంత్రంగా బిర్సా ముండా జయంతి
- తీవ్ర నిరసన తెలిపిన గిరిజన సంఘాలు



నిలబడి కార్యక్రమాన్ని తిలకిస్తున్న సర్పంచ్ నాగలక్ష్మి

ఆత్మకూరురూరల్: మండలంలోని కొట్టాల చెర్వు చెంచు గూడెంలో శుక్రవారం బిర్సా ముండా జయంతిని చెంచులు లేకుండానే తూతూ మంత్రంగా నిర్వహించారు. జన్ జాతీయ గౌరవ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బిహార్‌లోని జామై నుంచి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా పాల్గొని దర్తి ఆబజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద దేశంలోని ఆదిమ గిరిజనుల కోసం రూ.6,900 కోట్లతో చేపట్టిన సమగ్ర అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేశారు. ఈ పథకం కింద 500 జనాభా ఉన్న ప్రతి గిరిజన గూడేనికి విద్యుత్, రోడ్డు, సురక్షిత తాగునీరు, పక్కాగృహాలు తదితర అంశాలలో సంతృప్త పద్ధతిలో పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. కాగా కార్యక్రమానికి శ్రీశైలం ఐటీడీఏ పీఓ శివప్రసాద్, ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్‌లు రత్నరాధిక, దేవి, ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్ గుండాలనాయక్ పాల్గొన్నారు.

చెంచులకు స్థానం ఏదీ?

49 చెంచు గూడేలున్న జిల్లాలో సభకు చెంచులను రప్పించడంలో ఐటీడీఏ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. అందుకే సభలో గ్రామంలోని ఆశ్రమపాఠశాల విద్యార్థులు, సభ నిర్వహణ కోసం వచ్చిన ఐటీడీఏ ఉపాధ్యాయులు, ఉద్యోగులతో సమావేశ స్థలిని నింపివేశారు. కొట్టాల చెర్వుకు చెందిన కొందరు చెంచులు మాత్రమే సభలో పాల్గొన్నారు. ఇందిరేశ్వరం, కొత్తపల్లెకు చెందిన ఓ ఐదు మంది చెంచులు ఉన్నప్పటికీ వారేవో సమస్యల పరిష్కారం కోసం మాత్రమే వచ్చారు. చెంచు గిరిజనుల సమస్యలు చర్చించకుండా కేవలం ప్రధాని ప్రసంగంతో సభను ముగించడం సరికాదని గిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

చెంచు సర్పంచ్‌కు దక్కని ప్రొటోకాల్

ఇదే చెంచుల సభలో అదే వర్గానికి చెందిన మహిళా సర్పంచ్‌కు ప్రొటోకాల్ దక్కలేదు. కొట్టాల చెర్వు చెంచుగూడేం సర్పంచ్ నాగలక్ష్మి ప్రారంభంలోనే మొదటి వరసలో కూర్చుంది. కాసేపటికి ఆర్డీఓ, హౌసింగ్ పీడీ తదితర మొదటిశ్రేణి అధికారులు రావడంతో ఆమె రెండో వరుసలోకి వెళ్లి కూర్చున్నారు. అంతలో తహసీల్దార్ రావడంతో సర్పంచ్ లేవాల్సి వచ్చింది. ఈ సారి ఆమెకు కుర్చీ లేకపోవడంతో నిల్చొనే కార్యక్రమాన్ని తిలకించింది.

రేషన్ బియ్యం సీజ్



పట్టుబడిన రేషన్ లారీతో ఎస్‌ఐ విజయ్‌కుమార్

మంత్రాలయం: ఏపీ నుంచి కర్ణాటకకు తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని మాధవరం చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్‌నాయుడు, ఎస్‌ఐ విజయ్‌కుమార్ పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన శ్రీకాంత్ ఏపీలోని పలు పల్లెల్లో తక్కువ ధరకు రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి కర్ణాటకకు తరలించి అక్కడ అధిక ధరకు విక్రయించేవాడు. ఈక్రమంలో 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తుండగా తనిఖీల్లో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. లారీని సీజ్ చేసి ఆర్‌ఐ ఆదామ్, వీఆర్వో నరసప్ప సమక్షంలో పంచనామా నిర్వహించారు.